- మొన్న ఎల్లారెడ్డిలో.. నిన్న ఇందూరులో హడావుడి
- ప్లాస్టిక్ వాడితే జరిమానా విధిస్తామని హెచ్చరిక
- నాలుగు రోజుల తంతు.. తర్వాత షరామామూలే..
- కవర్ల తయారీపై కన్నేస్తేనే సమస్య పరిష్కారం



# ప్లాస్టిక్‌పై సమరం

## మున్సిపల్ అధికారుల్లో కదలిక

**దైనందిన జీవనంలో** ప్లాస్టిక్ వినియోగం విచ్చలవిడిగా పెరిగిపోయింది. చివరకు తినే ఆహారం, తాగే ఛాయ్ సహా అన్నీ కవర్లలోనే మోసుకెళ్లడం అలవాటైంది. అదుపు లేకుండా పోతున్న ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణానికి పెను ప్రమాదం ఏర్పడింది. భవిష్యత్తు తరాల మనుగడకు ముప్పుగా మారినా ప్లాస్టిక్‌ను నియంత్రించడంలో అధికార యంత్రాంగం పట్టనట్టు వ్యవహరిస్తున్నది. వాస్తవానికి ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో నిర్దేశిత పరిమాణం కంటే తక్కువ ఉన్న ప్లాస్టిక్‌పై నిషేధం ఉంది. కానీ, దాన్ని అమలు చేయడంలో వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. అయితే, ప్లాస్టిక్‌ను నియంత్రిస్తున్నామని చెప్పుకోవడానికి అధికారులు అప్పుడప్పుడు తనిఖీలు నిర్వహిస్తుంటారు. ఏదో నాలుగు రోజులు హడావుడి చేసి, ఆ తర్వాత వదిలేస్తారు. మళ్లీ తాజాగా మొన్న బాన్సువాడలో, నిన్న నిజామాబాద్‌లో మున్సిపల్ అధికారులు ప్లాస్టిక్ నియంత్రణపై దృష్టి సారించడం గమనార్హం.

–ఖలీల్‌వాడి, మే 24



### ఎల్లారెడ్డిలోని దుకాణాల్లో తనిఖీలు

ఎల్లారెడ్డి రూరల్, మే 24: దుకాణాదారులు ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని ఎల్లారెడ్డి మున్సిపల్ సిబ్బంది సూచించారు. పట్టణంలోని పలు దుకాణాల్లో వారు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ప్లాస్టిక్ వాడకంతో కలిగే అనర్థాలను దుకాణాదారులకు వివరించారు. నిబంధనలు అతిక్రమిస్తే జరిమానా విధిస్తామని బల్దియా కమిషనర్ శ్రీహరిరాజు హెచ్చరించారు. ఎల్లారెడ్డిని ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు పట్టణ ప్రజలు, దుకాణాదారులు సహకరించాలని కోరారు.



జిల్లాలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం విపరీతంగా పెరిగింది. కవర్లలోనే అన్నీ మోసుకెళ్తున్నారు. నిత్యావసర సరుకుల నుంచి తినే ఆహార పదార్థాల వరకూ అన్నింటికీ ప్లాస్టిక్కే దిక్కయింది. పల్లెలు, పట్నాలనే తేడా లేకుండా ఎక్కడ చూసినా వాటి వినియోగం విచ్చలవిడిగా పెరిగింది. రోడ్లు, డ్రెయినేజీలు ప్లాస్టిక్ కవర్లతో నిండి పోతున్నాయి. ఆహార వ్యర్థాలను కవర్లలో పెట్టి పాడేయడంతో వాటిని తిని పశువులు మృత్యువాత పడుతున్నాయి. ప్రకృతికి, జీవజాతి మనుగడకు ప్రమాదకరంగా మారిన ప్లాస్టిక్‌ను నియంత్రించాల్సిన బాధ్యతను అధికార యంత్రాంగం పూర్తిగా విస్మరించింది. దీంతో వ్యర్థాల నిర్వహణ స్థానిక సంస్థలకు జటిలంగా మారింది.

**'రీసైక్లింగ్' కవర్లు మేలు..**

సింగిల్ యూజ్ కవర్లను ప్రభుత్వం గతంలోనే నిషేధించింది. ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై సర్కారు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. 20 మైక్రాన్ కంటే తక్కువ ఉన్న కవర్లను వాడొద్దని స్పష్టం చేసింది. దీంతో అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా అధికారులు కొంత హడావుడి చేశారు. కవర్లను విక్రయించే, వినియోగించే వారిపై జరిమానాలు విధించారు. నాలుగు రోజుల తర్వాత పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. ఏడాదికోసారి హడావుడి చేయడం, ఆ తర్వాత వదిలేయడం అధికార యంత్రాంగానికి పరిపాటిగా మారింది. ప్రజలంతా 'యూజ్ అండ్ త్రో' విధానానికి అలవాటు పడిన తరుణంలో రీసైక్లింగ్ కవర్ల వినియోగాన్ని పెంచితే కొంత మార్పు వచ్చే అవకాశముంది. 20 మైక్రాన్ కంటే ఎక్కువ మందం కలిగిన కవర్ల ద్వారా పర్యావరణానికి ఎలాంటి హానీ కలుగదు. వీటిని రీసైక్లింగ్ చేసి మళ్లీ వినియోగించుకునే అవకాశముంటుంది. వ్యర్థాల నిర్వహణ కూడా సులువుగా మారుతుంది.

**తయారీని నియంత్రిస్తే..**

ప్లాస్టిక్ వినియోగంపైనే దృష్టి సారిస్తున్న అధికారులు.. అసలు సమస్య మూలాలను విస్మరిస్తున్నారు. వాస్తవానికి సింగిల్ యూజ్ కవర్ల తయారీపై కన్నేస్తే సమస్యకు పరిష్కారం దొరికినట్టే. కానీ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టకుండా, కేవలం దుకాణాల్లో తనిఖీలకే పరిమితమవుతున్నారు. కనిపించిన కవర్లను పట్టుకుపోతున్నారు తప్పితే శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టడం లేదు. నిర్దేశిత ప్రమాణాల మేరకు కాకుండా తక్కువ మైక్రన్ కవర్లు తయారీ చేసే సంస్థలు లేదా వ్యక్తులపై చర్యలు తీసుకుంటే, సింగిల్ యూజ్ కవర్లు బహిరంగ మార్కెట్‌లో అందుబాటులోనే ఉండవు. తద్వారా ప్లాస్టిక్‌ను నియంత్రించడం సులువుగా మారుతుంది. ఆ దిశగా అధికారులు చర్యలు చేపడితే జీవ జాతితో పాటు పర్యావరణానికి మేలు చేసినవారవుతారు.



నిజామాబాద్‌లో మాంసం విక్రేతలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

### దుకాణాల్లో అధికారుల తనిఖీలు

ఖలీల్‌వాడి, మే 24: విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం పెరిగిపోతున్న తరుణంలో నిజామాబాద్ మున్సిపల్ అధికారులు నిద్ర లేచారు. దుకాణాలు, వ్యాపార సముదాయాల్లో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. మెడికల్ హెల్త్ ఆఫీసర్ (ఎంహెచ్‌వో) సాజిద్ అలీ తన సిబ్బందితో కలిసి నగరంలోని పలు హోటళ్లను పరిశీలించారు. ప్లాస్టిక్ కవర్లు వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని యజమానులను హెచ్చరించారు. పెద్దబజార్‌లోని కూరగాయల సముదాయాలతో పాటు చికెన్ సెంటర్ నిర్వాహకుల వద్ద ఉన్న కవర్లను స్వాధీనం చేసుకున్నారు. మరోసారి ప్లాస్టిక్ కవర్లలో విక్రయిస్తే రూ.2 వేల వరకూ జరిమానా విధిస్తామని హెచ్చరించారు.



నిజామాబాద్‌లో పాలిథిన్ కవర్లను స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

# ప్రశాంతంగా పాలిసెట్

కామారెడ్డి/ఖలీల్‌వాడి, మే 24 : ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో పలు డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం శుక్రవారం నిర్వహించిన పాలిసెట్ ప్రశాంతంగా ముగిసిందని కామారెడ్డి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, పాలిసెట్ కో–ఆర్డినేటర్ డాక్టర్ విజయ్ కుమార్, నిజామాబాద్ ప్రభుత్వ సాంకేతిక కళాశాల జిల్లా సమన్వయ కర్త ఫణిరాజ్ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన నాలుగు కేంద్రాల్లో మొత్తం 2,301 మంది విద్యార్థులకు 2134 మంది పరీక్షకు హాజరైనట్లు పాలిసెట్ కో–ఆర్డినేటర్ డాక్టర్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఇందులో బాలికలు 1175, బాలురు 1126 మంది ఉన్నారని తెలిపారు. సాందీపని డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, ప్రత్యేక పరిశీలకులు భరత్ కుమార్, హరికృష్ణ, ప్రత్యేక స్క్వాడ్ బృందం సభ్యులు బలరాం, గోపాల్, ఆంజనేయులు తనిఖీ చేశారు. కేంద్రంలో విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించినట్లు వివరించారు. నిజామాబాద్‌లో మొత్తం 5,586 మంది విద్యార్థులకు 4,961 మంది పరీక్షకు హాజరైనట్లు ప్రభుత్వ సాంకేతిక కళాశాల జిల్లా సమన్వయ కర్త ఫణిరాజ్ తెలిపారు. ఇందులో బాలురు 2,559, బాలికలు 2402 మంది ఉన్నారని పేర్కొన్నారు. పాలిసెట్‌కు మొత్తం 88.81శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు.



కామారెడ్డి పట్టణంలోని ఓ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్, ప్రత్యేక స్క్వాడ్ బృందం

# ఇంటర్ అడ్వాన్స్‌డ్ పరీక్షలు షురూ

కామారెడ్డి/ ఖలీల్‌వాడి, మే 24 : ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఉమ్మడి జిల్లాలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. మొదటి సంవత్సరం పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించారు. కామారెడ్డి జిల్లాలో 29, నిజామాబాద్ జిల్లాలో 38 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. కామారెడ్డి జిల్లాలో ప్రథమ సంవత్సరం పరీక్షలకు జనరల్ 1171 మంది విద్యార్థులకు 1089 మంది,ఒకేషనల్ 304 మంది విద్యార్థులకు 274 మంది హాజరైనట్లు హాజరైనట్లు ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం తెలిపారు. ద్వితీయ సంవత్సర పరీక్షలకు జనరల్ 523 మంది విద్యార్థులకు 488 మంది, ఒకేషనల్ 76 మంది విద్యార్థులకు 73 మంది హాజరైనట్లు వివరించారు. నిజామాబాద్ జిల్లాలో ఫస్టియర్ పరీక్షలకు 3,662 మంది విద్యార్థులకు 3,335 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 1,498 మందికి 1396 మంది హాజరైనట్లు జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి రవికుమార్ తెలిపారు.

### ధాన్యం సేకరణ

# వేగవంతం చేయాలి

**కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్**



రాంరెడ్డిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

బీబీపేట్, మే 24: జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ చివరి దశకు వచ్చిందని, నాలుగు రోజుల్లో పూర్తవుతుందని కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని రాంరెడ్డిపల్లి, ఇస్సానగర్, ఉప్పర్‌పల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ధా న్యం కుప్పలు, తేమ శాతాన్ని పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని రైతులను అడిగి తెలుసుకొన్నారు. ధాన్యానికి ఏమైనా తరుగు తీస్తున్నారా అని ప్రశ్నించగా అలాంటిదేమీలేదని రైతులు సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలకు అవసరమైన లారీలను పంపి మిల్లులకు ధాన్యం చేరవేస్తున్నట్లు తెలిపారు. ఇంకా 18 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మిగిలి ఉందని చెప్పారు. బీబీపేట్, దోమకొండ మండలాల్లో ధాన్యం రాశులు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. వర్షాలు కురిసే సూచన ఉన్నందున ధాన్యం సేకరణలో వేగం పెంచాలని నిర్వాహకులకు సూచించారు. రైస్ మిల్లర్లు కూడా అన్‌లోడింగ్ పాయింట్లను ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 50 వేల మంది రైతుల నుంచి రూ.642 కోట్ల విలువ చేసే 2, 91, 475 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతుల ఖాతాల్లో రూ. 571 కోట్లు జమ చేశామని చెప్పారు. జిల్లాలో 288 కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తయ్యిందని, మరో 62 కేంద్రాలు కొనసాగుతున్నాయని తెలిపారు.

### నాటి బలిదేవత..

# నేడు తెలంగాణ తల్లి ఎట్లయింది?

- ఉద్యమాన్ని అణచాలని చూసింది ఆనాటి కాంగ్రెస్ నేతలు కాదా?
- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే సూర్యనారాయణగుప్తా

వినాయక్‌నగర్, మే 24: ఆనాడు తెలంగాణ బలిదేవత సోనియమ్మ ఈనాడు తెలంగాణ తల్లి ఎట్లయిందో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. శుక్రవారం నిజామాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వందల మందిని బలి తీసుకున్న బలిదేవత సోనియాగాంధీ అని అన్న రేవంత్‌రెడ్డి.. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవానికి ఆమెను ఎలా ఆహ్వానిస్తున్నారో సమాధానం చెప్పాలన్నారు. నాడు తెలంగాణ కోసం ఎంతో మంది ప్రాణ త్యాగాలు చేస్తుంటే ఆ కన్న తల్లిదండ్రుల కడుపుకోత చూడలేక బీజేపీ నాయకురాలు సుష్మాస్వరాజ్ పార్లమెంట్‌లో తెలంగాణ గోసను వినిపించారని గుర్తుచేశారు. కానీ, ఆనాడు తెలంగాణ కాంగ్రెస్ నాయకులు ఉద్యమాన్ని అణచివేయాలని చూశారని, ఆంధ్ర నాయకులకు అమ్ముడుపోయారన్నారు. తెలంగాణ బిడ్డల ప్రాణాలు పోతుంటే పదవే ముఖ్యమని గోడ మీద పిల్లిలా వ్యవహరించిన ఘనత కాంగ్రెస్ నాయకులదని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమంలో వారు చేసింది శూన్యమని తెలిపారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చి, తెలంగాణను ఇంకా అప్పుల కుప్పచేసి, ఉన్న ప్రభుత్వ ఆస్తులను అమ్మే పనిలో కాంగ్రెస్ వారు ఉన్నారన్నారు. తెలంగాణ సొమ్మంతా ఢిల్లీకి దోచిపెడుతున్నారని ధ్వజమెత్తారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

# ఊరంతా కరెంట్ షాక్!

### సబ్‌స్టేషన్ ఎదుట గ్రామస్తుల ఆందోళన


రాజంపేట్, మే 24: మండలంలోని పలు గుట్ట తండాలోని పలు ఇండ్లకు విద్యుత్ సరఫరా కావడంతో పలువురు గాయాలపాలయ్యారు. ఈ ఘటన గురువారం రాత్రి చోటుచేసుకున్నది. ఇందుకు సంబంధించిన వివరాలు.. వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి చేరుకుని సేదతీరె సమయంలో గ్రామంలోని పలు నివాసగృహాలకు ఒక్కసారిగా విద్యుత్ సరఫరా కావడంతో అందరూ ఉలిక్కిపడ్డారు. ఇంటి గోడలతోపాటు ఇంట్లోని వస్తువులకు సైతం విద్యుత్ సరఫరా కావడంతో కేకలు వేస్తూ బయటికి పరుగులు తీశారు. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తి వీపుభాగంలో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో తండావాసులు వెంటనే కొండాపూర్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించి విద్యుత్ సిబ్బందిని నిలదీశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యుత్ సిబ్బంది ప్రమాదానికి కారణాన్ని కనిపెట్టేందుకు శ్రమించారు.ఓ ఇంటి వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్తింగ్ రావడంతో ఈ సమస్య తలెత్తిందని గుర్తించి పరిష్కరించడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.



కొండాపూర్ సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళ చేస్తున్న తండావాసులు



విద్యుత్ షాక్‌తో గాయాలపాలైన తండావాసి



(ఇన్‌సెట్లో) ఇంటి గోడకు సరఫరా అవుతున్న విద్యుత్

# మొదటి రోజే విత్తనాల కొరత

- తూతూ మంత్రంగా 'జీలుగ' పంపిణీ
- విత్తనాలు అందక అన్నదాత ఆవేదన

గాంధారి, మే 24: ఎరువులు, విత్తనాల పంపిణీలో ప్రభుత్వ నిర్లక్ష్యంతో అన్నదాత ఆందోళన చెందుతున్నాడు. సరిపడా విత్తనాలు అందక రైతులు నానా పాట్లు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న జీలుగ విత్తనాల పంపిణీని గాంధారి మండల కేంద్రంతోపాటు గండివేట్ సొసైటీ పరిధిలో శుక్రవారం ప్రారంభించారు. ప్రారంభించిన కొద్దిసేపటికే విత్తనాలు అమ్ముడుపోయాయి. దీంతో చాలామంది రైతులకు జీలుగ విత్తనాలు లభించకపోవడంతో నిరాశతో వెనుదిరగగా..మరికొందరు ఆందోళన చేపట్టారు. గాంధారి మండలంలో ప్రతి ఏటా దాదాపు 17 వేల ఎకరాల్లో వరి పంటను సాగుచేస్తారు. దీనిని దృష్టిలో ఉంచుకొని వ్యవసాయాధికారులు జీలుగ, జనుము విత్తనాలను అందుబాటులో ఉంచేవారు. కానీ ఈసారి మండలానికి 822 బస్తాలు (30 కిలోలు) మాత్రమే వచ్చాయి. ఇందులో గాంధారి సింగిల్ విండోలో 333 బస్తాలు, ముదెల్లి సింగిల్ విండోలో 333, మండల కేంద్రంలోని ఆగ్రోస్ కేంద్రంలో 156 బస్తాలను వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉంచారు. శుక్రవారం విత్తనాల పంపిణీ ప్రారంభించగా.. చాలా మంది రైతులకు జీలుగ విత్తనాలు లభించలేదు. కేసీఆర్ పాలనలో రైతులకు సరిపడా విత్తనాలు అందుబాటులో ఉంచేవారని రైతులు గుర్తుచేసుకున్నారు. విత్తుకునే సమయం దాటిన తర్వాత విత్తనాలు వచ్చినా ఫలితం ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు.



గండివేట్‌లో జీలుగ విత్తనాల కోసం గుమిగూడిన రైతులు

**ప్రతిపాదనలు పంపించాం..**

గాంధారి మండలంలో పంటను సాగు చేసే రైతులను దృష్టిలో ఉంచుకొని అవసరమైన జీలుగ, జనుము విత్తనాల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. అలాగే వరి పంటను సాగు చేసే రైతుల కోసం 900 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను అందుబాటులో ఉంచాలని నివేదించాం.

-నరేశ్, గాంధారి మండల వ్యవసాయాధికారి

# టీటీడీసీలో షార్ట్ సర్క్యూట్

## రికార్డులు దగ్ధం



మంటలను ఆర్పివేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

డిచ్‌పల్లి, మే 24 : మండల కేంద్రంలోని సాంకేతిక శిక్షణ అభివృద్ధి సంస్థ (టీటీడీసీ)లో శుక్రవారం తెల్లవారు జామున అగ్నిప్రమాదం సంభవించింది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో కాన్ఫరెన్స్ హాలులోని రికార్డులు, ఫర్నిచర్ దగ్ధమైంది. నైట్ వాచ్‌మన్ ఒడ్డెన్న ఉదయం లేచి చూసే సరికి కాన్ఫరెన్స్‌హాలు నుంచి పొగలు రావడాన్ని గుర్తించి, వెంటనే డీఆర్డీవో సాయాగౌడ్, ఐకేపీ అధికారులకు సమాచారమిచ్చాడు. వారి సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే కాన్ఫరెన్స్ హాలులో భద్రపరిచిన డీఆర్డీఏ పాత రికార్డు ఫైళ్లు, ఫర్నిచర్ కాలి బూడిదైంది. ఘటనా స్థలాన్ని డీఆర్డీవో సాయాగౌడ్ పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.